క్లుప్తంగా

మిర్యాలగూడ ఎస్ఎఫ్ఓకు పదోన్నతి



ఎస్ఎఫ్ఓను సత్కరిస్తున్న సిబ్బంది

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ అగ్నిమాపక శాఖలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె. రాజు కు అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ గా పదోన్నతి లభించింది. రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ గా వెళ్తున్నాడు. దీంతో మంగళవారం అగ్నిమాపక కార్యాలయంలో సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌టీఓ చంద్రశేఖర్‌తో పాటు ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి

పెద్దవూర : రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం మద్దతు ధర కల్పించి కొనుగోలు చేస్తుందని జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చింతపల్లి, చలకుర్తి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకుని తమ పేర్లు నమోదు చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. గ్రేడ్-ఏ రకం రూ.2060లు, సాధారణ రకం రూ.2040లు మద్దతు ధర ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ మండల అధ్యక్షుడు గజ్జల లింగారెడ్డి, నాయకులు గోన విష్ణువర్ధన్‌రావు, జటావత్ రవినాయక్, మెండె సైదులు, కర్నాటి మునిరెడ్డి, బోయ నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ : మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన చింతకాయల రాములమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా మంజూరైన రూ.1.50లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుండిగల యాదమ్మశ్రీనివాస్, నాయకులు చిమట ఆంజనేయులు, ఎర్రయ్య, జ్యోతి, వెన్నెల, వీరేశం, ఎల్లయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆది శంకరాచార్య జయంతి



ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్ : జగద్గురువు ఆదిశంకరాచార్య జయంతిని పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శిరసనగండ్ల ఈశ్వరాచారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గడగోజు చంద్రశేఖర్, ఇనుగుర్తి గోవర్ధనాచారి, చేర్యాల వెంకటాచారి, మండలోజు సైదాచారి, పోలోజు శ్రీనివాస్, కూరెళ్ల మట్టయ్య, కాతోజు వాసు, తాడోజు శ్రీనివాస్‌చారి, దేవులపల్లి అశోక్‌చారి, కొప్పోజు వెంకటాచారి, కొల్లూరి బ్రహ్మాచారి, రామ బ్రహ్మాచారి, లోకాచారి, రమేష్‌చారి తదితరులున్నారు.

నిరుద్యోగులకు శిక్షణ

నల్లగొండ రూరల్ : ఉమ్మడి జిల్లా నిరుపేద విద్యార్థులు ఉద్యోగ పోటీ పరీక్షలు రాసేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తామని కేవీకే ఫౌండేషన్ చైర్మన్ కర్నాటి విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని వీఎంఆర్ లాజిక్స్ కోచింగ్ సెంటర్ ద్వారా గ్రూప్ 2,3,4 లో ఆన్‌లైన్ కోచింగ్ ఉచితంగా అందిస్తామన్నారు. నిరుద్యోగులు వీఎంఆర్ లాజిక్స్ యూట్యూబ్ చానల్‌లో కేవీకే ఫౌండేషన్ లింక్ క్లిక్ చేసి తమ వివరాలను పొందుపర్చాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీనివాస్, రవికుమార్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష

● శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మిర్యాలగూడ : మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే



దేవరకొండ : మాట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామరక్ష అని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయిరమ్య ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధుల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం మోకాలడ్డుతుందని, విభజన చట్టంలోని హామీలను కేంద్రం అమలు చేయలేదని ఆరోపించారు. అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సాగు, తాగునీటి ప్రాజెక్టులతో పాటు వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించడంతో పాటు రెండు పంటలకు పంట సాయం అందిస్తుందని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 60లక్షల ఎకరాల నుంచి కోటియాభై లక్షలకు పెరిగిందన్నారు. దేశవ్యాప్తంగా యాసంగిలో 96లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగితే ఒక్క తెలంగాణలోనే 56లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని ఆయన ఆరోపించారు. అనంతరం దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ రూ.600 కోట్లతో నియోజకవర్గంలోని అన్ని ఆవాసాలకు మిషన్ భగీరథ ద్వారా సాగునీరు అందుతుందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక రిజర్వాయర్లున్న ప్రాంతంగా దేవరకొండ నిలుస్తుందన్నారు. అనంతరం సభలో 15 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, మాధవరం సునితాజనార్దన్‌రావు, వంగాల ప్రతాప్‌రెడ్డి, జడ్పీటీసీలు మారుపాకుల అరుణసురేష్‌గౌడ్, కంకణాల ప్రవీణావెంకట్‌రెడ్డి, కేతావత్ బాలునాయక్, పసునూరి సరస్వతమ్మ, నాయకులు పున్న వెంకటేశ్వర్లు, టీవీఎన్.రెడ్డి, రమావత్ దస్రూనాయక్, లోకసాని తిరుపతయ్య, దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ముత్యాల సర్వయ్య, ఎల్గూరి వల్లపురెడ్డి, ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, దేవరకొండ బీఆర్ఎస్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం విధానాలపై సీఎం కేసీఆర్ పోరాటం

మిర్యాలగూడ : కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీఎం కేసీఆర్ అలుపెరుగని పోరాటం చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీమన్నారాయణ ఫంక్షన్‌హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. తెలంగాణ పథకాలను చూసి దేశ ప్రజలు కూడా తమకు ఈ పథకాలు కావాలని, దేశ రాజకీయాల్లోకి రావలనడంతో బీఆర్ఎస్ పార్టీని స్థాపించినట్లు తెలిపారు. కేంద్రం మంత్రి అమిత్‌షా ఇటీవల చేవెళ్లలో నిర్వహించిన సభలో ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తామనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.ముస్లింలు దేశ ప్రజలు కాదా అని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. గిరిజనులకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాయల తెలంగాణ రాష్ట్ర అంశం ఇప్పుడు తెరమీదకు రావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆంధ్ర ప్రజలు కూడా అక్కడ బీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తున్నారన్నారు. అదేవిధంగా వైఎస్ఆర్ పేరును అడ్డుపెట్టుకోని షర్మిల ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుందని, తెలంగాణ పోలీసులపై దౌర్జన్యం చేయడం సమంజసం కాదన్నారు. ఆమెకు రాజకీయాలు ఆసక్తి ఉంటే ఆంధ్రలో చూసుకోవాలే కాని ఇక్కడ ఏం పని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలతో అగమ్యగోచరంగా ఉందన్నారు. ×మిర్యాలగూడ నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పనితీరు అద్భుతంగా ఉందన్నారు. మిర్యాలగూడలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారని తిరిగి రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాస్కర్‌రావు ఎమ్మెల్యేగా గెలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడలో సీపీఎం పోటీ చేస్తుందనడంలో వాస్తవం లేదని, ఎమ్మెల్యే భాస్కర్ రావే పోటీలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, డీసీఎంఎస్ జిల్లా వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, రైతు సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు నామిరెడ్డి యాదగిరిరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, నాయకులు మదార్‌బాబా, యూసుఫ్, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, వింజం రాజేంద్రప్రసాద్, వింజం శ్రీధర్, ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాలియా : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్



హాలియాలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

హాలియా : అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని హాలియా నాగార్జున సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం హాలియాలోని లక్ష్మీ నరసింహ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే నోముల భగత్, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్‌తో కలిసి పట్టణంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండా ఎగురవేసిన ఆయన అనంతరం తెలంగాణ తల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 11 తీర్మానాలను ఆమోదించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నోముల భగత్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు. కేసీఆర్ 8 ఏళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాలో అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ పాలన, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో రాజకీయ లబ్ధి కోసమే మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు బీజేపీ పార్టీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, రాష్ట్ర ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజేందర్‌రెడ్డి, డీసీసీబీ జిల్లా డైరెక్టర్లు విరిగినేని ఆంజయ్య, జయరాంనాయక్, పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, ఎంపీపీలు జయమ్మ, వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు జవ్వాజి వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, పాక్స్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు మహేందర్‌రెడ్డి, జానయ్య, రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాలకు 27న వేలం

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 27న వేలం వేయనున్నట్లు వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ నజీర్‌పాష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు ఉన్నాయని బహిరంగ వేలంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు. ఉదయం 11గంటలకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు సర్వసభ్య సమావేశం

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ దండ జితేందర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులంతా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రశాంతంగా ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

మిర్యాలగూడ : ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు మంగళవారం నుంచి పకడ్బందీ ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మిర్యాలగూడ పట్టణంలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు గాను ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బకల్వాడీ ఉన్నత పాఠశాల ఏ.బీ కేంద్రం, సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 981మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 127మంది విద్యార్థులు టెన్త్, ఇంటర్ పరీక్షలకు గైర్హాజరైనట్లు అధికారులు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ బాలాజీనాయక్ తనిఖీ చేశారు.

కొనసాగుతున్న ఐకేపీ వీఓఏల సమ్మె

అడవిదేవులపల్లి : పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీఓఏలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు కుర్ర నాగ నాయక్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు నర్మద, జ్యోతి, వెంకట్, భవాని, పుష్ప, చెన్నయ్య తదితరులున్నారు.

నీటి సమస్య పరిష్కరించిన ఎంపీపీ

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీలోని లక్ష్మీనగర్ కాలనీవాసులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని తెలుసుకున్న కొండమల్లేపల్లి ఎంపీపీ దూదిపాల రేఖశ్రీధర్‌రెడ్డి తన సొంత ఖర్చుతో బోరు, పంప్ సెట్ మోటారు ఏర్పాటు చేయించారు. మంగళవారం బోరును ప్రారంభించడంపై లక్ష్మీనగర్ కాలనీవాసులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సుమలత, ఉప సర్పంచ్ మంగ్యానాయక్, ఎంపీటీసీ జగన్‌నాయక్, రాణి రాజునాయక్, కార్తీక్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం



పాదయాత్ర చేస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమవుతాయని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చేపడుతున్న 'హాథ్‌సే హాథ్ జోడో' యాత్ర మంగళవారం మిర్యాలగూడ మండలంలోని జటావత్‌తండా, ధీరావత్‌తండా, కొత్తసామ్యతండా, కొత్తూరు, టీక్యాతండాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతామని, రైతు రుణమాఫీ, కౌలు రైతులకు నగదు, రూ.500కే గ్యాస్ సిలిండర్, అర్హులందరికీ పెన్షన్లు, డబుల్‌బెడ్ రూమ్‌లు, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రత్నకుమారి, చలపతిరావు, జింద, రవీందర్‌రెడ్డి, వెంకటయ్య, పాండు నాయక్, వెంకట్రామ్, కౌసల్య, నారాయణరెడ్డి, దేవిసింగ్‌నాయ్, పత్యానాయక్, తులరాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



దేవరకొండ : మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా సమాగ్రాభివృద్ధికి ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార యాత్ర మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగింది. మండల పరిధిలోని రత్యతండా, జేత్యతండా, పెద్దతండా ,వడ్త్యతండా, శేరిపల్లి గ్రామాల మీదుగా ప్రచారయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా డిండి లిఫ్ట్‌తో పాటు అనుబంధ రిజర్వాయర్లకు నిధులు కేటాయించి వాటిని పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రమావత్ అంజయ్య నాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, జయరాములు, కనకాచారి, వెంకటయ్య, నూనె రామస్వామి, అర్జున్, యా దయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంగలయ్య, గణేష్, పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : బీజేపీ మతోన్మాదాన్ని, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే ప్రజా చైతన్య యాత్ర చేస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో జన చైతన్య యాత్రను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా కనకయ్య, నాయకులు లింగానాయక్, యాదగిరి, చంద్రమౌళి, ఎంకన్న, రామలింగం, వెంకటయ్య, దుర్గమ్మ, రాజేశ్వరి, పద్మ, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



చింతపల్లి : రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

హాలియా : రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. అనుముల మండలంలోని అనుముల, శ్రీనాథపురం గ్రామాల్లోని ఐకేపీ, కొత్తపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మంగ, ఏపీఎం కళావతి, రైతులు తదితరులు ఉన్నారు.

పెద్దవూర : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నాయినవానికుంట, పులిచర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు ధాన్యంలో తాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. హమాలీలకు రైతులు క్వింటాకు రూ.45లు మాత్రమే చెల్లించాలని, అదనంగా ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్, మండల వ్యవసాయ అధికారి కె. సందీప్, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ వద్దిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఏపీఎం విజయ్‌కుమార్, సిబ్బంది మనోహర్, మనోజ్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

కొండమల్లేపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు అధికారులకు సూచించారు. మంగళవారం కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులు పడకుండా తగిన వసతులు కల్పించాలని సీఈఓ తిరుపతిరెడ్డికి సూచించారు. అయితే తాము గ్రోమోర్ దుకాణాల నుంచి విత్తనాలను కొనుగోలు చేసి పంటలను సాగు చేశామని, ఆ విత్తనాలు నకిలీ కావడంతోనే తాలు వస్తున్నట్లు రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రోమోర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మకుండా చూడాలని కోరారు. ఆయన వెంట ఆర్డీఓ గోపిరాం, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తనిఖీ చేశారు. అనంతరం నసర్లపల్లిలోని పారబాయిల్డ్ రైస్ మిల్లును తనిఖీ చేసి ధాన్యం నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ఆయ న వెంట ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ విశాలాక్షి, ఏఓ రామలింగేశ్వర్‌రావు, సీఈఓ రాజశేఖర్ రెడ్డి, ఆర్ఐ యాదయ్య, నర్సింహులు ఉన్నారు.

నిడమనూరు : మండలంలోని వెంకటాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు సందర్శించారు. ధాన్యం కాంటాలు అవుతున్న తీరు. ఎగుమతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక రైతులు ఉన్నారు.

తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

హాలియా : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో పని చేసిన తెలంగాణ ఉద్యమకారులను మంగళవారం పట్టణంలో హాలియా మున్సిపల్ మూడవ వార్డు కౌన్సిలర్ అన్నెపాక శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్ ఉద్యమకారులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు వర్ర వెంకట్‌రెడ్డి, ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, వడ్డె సతీష్‌రెడ్డి, గోపిశెట్టి నరసింహ, వద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను సుందర్‌రెడ్డి, నాగార్జున, మధుచారి, గుంటక మధుసూధనారెడ్డి కడ, వినయ్‌రెడ్డి, రాము, సోము, ఆంజాద్‌ఖాన్, షేక్ హుస్సేన్, సత్యనారాయణ రాజు, ఎల్లయ్య, షేక్ మక్బూల్, షేక్ జావీద్, రాంబాబు, సైదులు, షేక్ ముస్తఫా, శ్రీను, వెంకటయ్య ఉన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కరాటే శిక్షణను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహ, ఎంపీపీ జాన్ యాదవ్

దేవరకొండ : వేసవిలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్ అన్నారు. మంగళవారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలని ఆకాంక్షించారు. కరాటే లాంటి ఆత్మరక్షణ విద్యా ద్వారా శరీర ధృడత్వం పెంపొందుతుందన్నారు. దేవరకొండ ప్రాంత క్రీడాకారులకు అసోసియేషన్ అందిస్తున్న సేవలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింహ, ఎస్‌వీటీ, సభ్యులు ఉమామహేశ్వర్, సురేష్, వెంకన్న, మహేష్, జగదీష్, పాల్గొన్నారు.

రేషన్ డీలర్లకు గౌరవ వేతనం అందించాలి



మాట్లాడుతున్న పగిల్ల వెంకటేశ్వర్లు

హాలియా : రేషన్ డీలర్లకు గౌరవ వేతనం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 30వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 40వేలు ఇవ్వాలని ఆ సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు పగిల్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హాలియా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో హాలియా, నిడమనూరు, తిరుమలగిరి మండలాల డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు వెళ్తున్నట్లు కమిషనర్లకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారం కోసం మే 1న నార్కట్‌పల్లిలోని రేణుక ఎల్లమ్మ గార్డెన్‌లో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా రేషన్ డీలర్ల సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు యూసుఫ్‌బాబా, నాగేశ్వరరావు, దత్తు మదన్‌మోహన్, కోట అశోక్, సముద్రాల దామోదర్ పాల్గొన్నారు.

ఊరూరా గులాబీ జెండా రెపరెపలు

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మిర్యాలగూడ, నాగార్జున సాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో ని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

- సాక్షి, నెట్‌వర్క్



త్రిపురారంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కొండమల్లేపల్లిలో..



చందంపేటలో..



మాడుగులపల్లిలో..



పెద్దవూరలో..



చింతపల్లిలో..



మిర్యాలగూడ టౌన్ : అవంతిపురంలో..



నందికొండ మున్సిపాలిటీలో..